ఆపదలో ఆప్తులు

- నేడు జాతీయ అంబులెన్స్ పైలెట్ దినోత్సవం

కామారెడ్డి టౌన్: రోడ్డు ప్రమాదాలతో పాటు వివిధ కారణాలతో ఆపదలో ఉన్న వారి వద్దకు సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించి సేవలు అందించడంలో 108, 102, 1962 అంబులెన్స్ వాహన పైలెట్ల పాత్ర వర్ణించలేనిది. శుక్రవారం జాతీయ అంబులెన్స్ పైలెట్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. జిల్లాలో 50 మందికి పైగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబులెన్స్‌లకు పైలెట్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. పైలెట్లుగానే కాకుండా బాధితులకు అత్యవసర పరిస్థితులలో ప్రథమ చికిత్సలు కూడా అందిస్తారు. మెరుగైన వైద్య సేవలకు ఈఎంటీలకు సహకరిస్తారు. కరోనా కాలంలో వీరి సేవలు ఎంతో మంది ప్రాణాలను కాపాడారు. వీరు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారు.


కరోనా సమయంలో విధుల్లో ఉన్న 108 అంబులెన్స్ పైలెట్ (ఫైల్)

సేవలు చేయడం అదృష్టం



ప్రభుత్వ అంబులెన్స్‌లలో పైలెట్‌గా ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల్లో భాగస్వాములు కావడం అదృష్టంగా బావిస్తున్నా. మాకు గుర్తింపు లేకున్నా సరే కానీ వైద్య సెవలు అందిస్తున్నాము చాలు. క్షతగాత్రులను, బాధితులను సకాలంలో ఆసుపత్రులకు చేర్చడంలో మాదే కీలక పాత్ర.

– కార్తీక్, పైలెట్, కామారెడ్డి

ప్రాణాలకు తెగించి..



కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించాం. కోవిడ్ సోకిన వారిని ఆస్పత్రులకు చేర్చే సమయంలో వారి బంధువులు కూడా ముట్టుకోని సమయంలో తామే అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించారు. కొందరికి అత్యవసరంగా సేవలందించాం. ప్రస్తుతం చాలీ చాలని వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం.

– ప్రశాంత్ , పైలెట్, కామారెడ్డి

కుష్టు వ్యాధిని నిర్మూలించాలి


పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర బృందం సభ్యులు


పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో..

పెద్దకొడప్‌గల్: కుష్టు వ్యాధి రహిత సమాజమం కోసం ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి బృంద సభ్యులు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం వారు సందర్శించి వైద్య సిబ్బందికి కుష్టు వాధి నివారణపై అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోనే చికిత్స అందించాలని సూచించారు. డీపీఎం వెంకటేశ్వర చారి, ఎంపీఎంవో శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిట్లం: కుష్టి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలగురించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు వెంకటేశ్వర్లు, రాధాక్రిష్ణ అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించ వచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి శిరీష, వైద్యాధికారులు శివకుమార్, రోహిత్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్‌లో విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. మూగజీవాలు ఆహారం కోసం తీగలను తింటే విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

నిజాంసాగర్ (జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని మూడు పురుగు మందులు, సీడ్ షాపులను బాన్సువాడ వ్యవసాయశాఖ ఏడీఏ వినయ్‌కుమార్ నేతృత్వంలో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న పురుగు మందులు, సీడ్ బస్తాల కంపనీలు, స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, పురుగు మందులు సరసమైన ధరలకు విక్రయించాలని దుకాణ యజమానులకు అధికారులు సూచించారు.

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని సిద్ధిసంగమేశ్వర ట్రేడర్స్, వీరభద్ర ట్రేడర్స్ పురుగుల మందు షాపులను టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలను అమ్మకూడదని, అన్ని విత్తనాలకు బిల్లు ఉండాలన్నారు. రైతులకు ప్రతి బిల్లు ఒరిజినల్ ఇవ్వాలని సూచించారు.


జుక్కల్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు

జీలుగ విత్తనాల పంపిణీ


పిట్లంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

పిట్లం: మండల కేంద్రమైన పిట్లంలో సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి జీలుగ విత్తనాలను గురువారం రైతులకు పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహకారం సంఘం కార్యదర్శి సంతోష్ రెడ్డి, సిబ్బంది హన్మండ్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంలో బాన్సువాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. అదేవిధంగా దేశాయిపేట్ సొసైటీలో వరి బీపీటీ–5204 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 25 కిలోల బ్యాగుకు రూ.883 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌రావు, చిన్న సాయిలు, హైమద్, భీమ్‌సింగ్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.


బోర్లంలో..

బాన్సువాడ : బాన్సువాడ సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఈవో రాణి తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాసు పుస్తకం జిరాక్స్ తమ వెంట తీసుకరావాలని సూచించారు.

ఆకట్టుకున్న సర్కస్

మద్నూర్: మండల కేంద్రంలో బుధవారం రాత్రి సర్కస్ ఉచితంగా నిర్వహించారు. సర్కస్‌లో కోతి చేసిన విన్యాసాలు, ఇద్దరు చిన్నారులు వైరుపై నడవడం, ఇనుప రాడ్డును గోంతుతో వంచడం, రింగులతో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

సర్కస్‌లో చేస్తున్న విన్యాసాలు



కంటి పరీక్షలు చేయించుకోవాలి


పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్

నిజాంసాగర్: కంటి సమస్యలున్న వారు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ సూచించారు. గురువారం మండలంలోని వెల్గనూర్ గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యం నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలో ఇప్పటి వరకు 22,098 మందికి కంటి పరీక్షలు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హిమబిందు తెలిపారు. వీరిలో 5,280 మందికి కంటి అద్దాలు అందజేశామని పేర్కొన్నారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని రాఘవపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ వెంకట్రాంరెడ్డితో కలిసి ఎంపీపీ రాజ్‌దాస్ ప్రారంభించారు. గ్రామంలో ఈ నెల 31 వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, డాక్టర్ క్రాంతికుమార్, కమలాకర్, శివయ్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

2,961 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో గురువారం వివిధ చోట్ల నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల్లో 2,961 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన 290 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 4,39,591 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. 64,561 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 93.16 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు.

అర్ధాంతరంగా పనులు నిలిపివేత

తాడ్వాయి: మండలంలోని పలు అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. తాడ్వాయి, ఎర్రాపహాడ్, క్రిష్టాజివాడి, సోమారంలో నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లు ఆ తర్వాత నిర్మాణాలు చేపట్టకుండా చేతులెత్తేశారు. కొన్ని బేస్మెంట్ లెవల్, మరికొన్ని చోట్ల పిల్లర్లు వేసి పనులు చేపట్టకుండా వదిలేశారు. ఆయా గ్రామాల్లో అరకొర వసతుల్లో ఉన్న అద్దెభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో అంగన్‌వాడి టీచర్లు, విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అర్ధాంతరంగా ఆగిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతున్నారు.


ఎర్రాపహాడ్‌లో పిల్లర్ల వరకే పరిమితమైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు

ఆటోనగర్‌తో కార్మికులకు ఉపాధి

- 14 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు
- రూ. 6.80 కోట్లతో పనులు ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 14 ఎకరాల్లో చేపట్టనున్న ఆటోనగర్‌లో రూ. 6.80 కోట్లతో అభివృద్ధి పనులను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ ఏర్పాటు వల్ల ఎంతో మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆటోనగర్ ఏర్పాటుకు సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, మోహన్‌నాయక్, గోపాల్‌రెడ్డి, శ్రీధర్, పాత బాలకృష్ణ, శ్రావణ్, వెంకట్‌రాంరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్

ఎల్‌వోసీ అందజేత..

మండలంలోని ఇబ్రహీంపేట్‌కు చెందిన షేక్ కమ్రొద్దీన్ చికిత్స నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ పథకం నుంచి మంజూరైన రూ. లక్ష విలువ చేసే ఎల్‌వోసీని అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందకు కృషి చేసిన బోర్లం గ్రామానికి చెందిన మన్నే చిన్న సాయిలుకు ప్రశంసాపత్రం అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బాన్సువాడ: మండలంలోని తిర్మలాపూర్, కొత్తాబాది గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి భూమి పూజ చేశారు. తిర్మలాపూర్‌లో రూ. 5 లక్షలతో పెద్దమ్మ తల్లి గుడి, మరో రూ.5 లక్షలతో మల్లన్న గుడి, రూ.5 లక్షలతో ఎల్లమ్మ ఆలయం, రూ.10 లక్షలతో రోడ్లు, రూ.10 లక్షలతో చెరువు కట్టపై గంగమ్మ గుడి, రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు శంకు స్థాపన చేశారు. కొత్తాబాది గ్రామంలో రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్, అంతర్గత పైపులైన్ నిర్మాణం, రూ. 25 లక్షల నిధులతో షాపింగ్ కాంప్లెక్స్, రూ. 10 లక్షలతో డ్వాక్రా భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఆర్డీవో రాజాగౌడ్, సర్పంచులు జిన్న రఘురామయ్య, అంకితసాయాగౌడ్, నాయకులు అంజిరెడ్డి, గంగుల గంగారం, మల్లారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, బాలయ్య, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.


తిర్మలాపూర్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

ఆధ్యాత్మికం

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన



లింగంపేట: మండలంలోని శెట్పల్లి గ్రామంలో ఆంజనేయ, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో గురువారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురెందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందజేస్తానన్నారు. అలాగే చారిత్రక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, సంజీవరెడ్డి, అట్టెం శ్రీను, సిద్దారెడ్డి, శంకరప్ప, నరహరి, దేవేందర్‌రెడ్డి, ముదాం సాయిలు, నహీం, రాంరెడ్డి, కిష్టాగౌడ్, గంగారెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలు



పెద్దకొడప్‌గల్: మండలంలోని బేగంపూర్ తండాలో జగదాంబ, సంత్ సేవాలాల మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ ఉత్సవాలు గురువారం ముగిశాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివారం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు

నిజాంసాగర్: మండలంలోని గున్కుల్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ జీవిత చరిత్ర నాటక ప్రదర్శనలో భాగంగా బుధవారం రాత్రి బోనాలు తీశారు. కార్యక్రమంలో కళాబృందం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కళాకారులు బాగారెడ్డి, బాస్కర్, స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.

బిచ్కుంద: మండలంలోని సిర్‌సముందర్‌లో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ముగిసిన హరినామ సప్తాహం



నిజాంసాగర్: నర్సింగ్‌రామ్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయ హరినామ సప్తాహంలో భాగంగా గోపాలకాలువలు, కలుషాలతో ఊరేగించి ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. తహసీల్దార్ నారాయణ, సర్పంచ్ సుబ్బురి సాయిలు, గైని విఠల్, మోహన్ రెడ్డి, విఠల్‌రెడ్డి, పండరి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డంతా గుంతలమయం



మద్నూర్: మండలంలోని రూసేగావ్ గేటు నుంచి కోడిచిర వరకు ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.55 కోట్లు మంజూరు చేసింది. అయితే ఇందులో రూ.1.30 కోట్ల పనులకు సంబంధించి ఆరు నెలల కిందట టెండర్లు వేసినా పనులు ఎందుకు ప్రారంభించినా అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోలార్ వినియోగంపై అవగాహన



కామారెడ్డి క్రైం: సోలార్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై మహిళా సంఘాలకు గురువారం కామారెడ్డి కలెక్టరేట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సోలార్ జిల్లా మేనేజర్ గంగాధర్, అదనపు డీఆర్‌డీవో మురళీకృష్ణ, డీపీఎం సుధాకర్, సోలార్ ఫీల్డ్ ఆఫీసర్ రాము పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీకి ఎంపిక


నరేందర్

నస్రుల్లాబాద్: జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు నెమ్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వి.నరేందర్ ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటరమణ తెలిపారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించనున్న సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలు పాల్గొంటారని పేర్కొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి చేయూత



రామారెడ్డి: పాల్వంచ మండలంలోని సింగరాయపల్లి సర్పంచ్ భర్త అధికం నర్సాగౌడ్ ఇటీవ అనుమానాస్పదంగా మృతి చెందడతో ఆయన కుటుంబానికి పలువురు గౌడ కులస్తులు అండగా నిలుస్తున్నారు. గురువారం జిల్లాలోని గౌడ కులస్తులు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపి గౌడ్, ఎంజీ వేణుగోపాల్ గౌడ్, గర్గుల్ సర్పంచ్ రవితేజ గౌడ్, గర్గుల్ రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



రాజంపేట: మండల కేంద్రంలో అనుమతిలేకుండా మొరం, చెరువు మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ నాయకులు ఆర్ఐ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు రాత్రి వేళల్లో మొరం, చెరువు మట్టి తవ్వుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగారెడ్డి, పిట్ల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, రాజిరెడ్డి. పందుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉద్యోగులు



ఎల్లారెడ్డి/నిజాంసాగర్ /తాడ్వాయి /రాజంపేట : కలెక్టర్ జితేష్ వి పాటిల్ జన్మదినం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు గురువారం మొక్కలను నాటారు. నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి, మల్లూర్, ముగ్దుంపూర్, అచ్చంపేట, వెల్గనూర్, మంగ్లూర్, నర్సింగ్‌రామ్‌పల్లి, మాగి, ఒడ్డేపల్లి గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు మొక్కలు నాటారు. తాడ్వాయిలో పంచాయ తీ సిబ్బంది మొక్కలను నాటారు. రాజంపేటలో ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో రఘురాం తదిత రులు మొక్కలు నాటారు.

సంక్షిప్తం

సంక్షేమ పథకాల అమలుపై అవగాహన

దోమకొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి పలువురు కళాకారులు ఆట పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. సారథి కళాకారులు బండ్ల రాము, విట్టల్ రెడ్డి, రమేష్ రావు, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

దోమకొండ: సంగమేశ్వర గ్రామంలో మధుసూదన్ రావు సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్ రావు, సర్పంచ్ నరేష్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన గంగాధర్ (37) అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందారు. ఆరేళ్ల కిందట ఆయనకు స్టంట్ వేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డిలోని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ తెలిపారు. ఇంజనీరింగ్‌లో అదిల్‌పాషా, జమీర్ హుస్సేన్, అమీర్ సోహెల్, మెడికల్, అగ్రికల్చర్‌లో ఎండీ ఫసియుద్దీన్, నితీష్ ప్రతిభ చూపారని వెల్లడించారు.

31వ రోజుకు చేరిన రిలే దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ పదార్థాలు విడుదల చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 31వ రోజుకు చేరాయి.

ఆలయానికి విరాళం

కామారెడ్డి టౌన్/లింగంపేట: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ గాలి గోపురం నిర్మాణానికి విరాళం ఇస్తానని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి రమణారెడ్డి తెలిపారు. అదేవిధంగా లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలోని శ్రీ మల్లీశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి కోసం పీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శుభాష్‌రెడ్డి విరాళం అందజేశారు.

డైనింగ్ హాల్ కోసం భూమి పూజ

ఎల్లారెడ్డిరూరల్: మత్తమాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో డైనింగ్ హాల్ నిర్మాణానికి సర్పంచ్ అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, పీఆర్ ఏఈ కృష్ణ భూమిపూజ చేశారు.

సంక్షేమ భవనానికి 31న శంకుస్థాపన

భిక్కనూరు/రాజంపేట: కామారెడ్డిలో రెడ్డి సంక్షేమ భవనం, హాస్టల్ నిర్మాణానికి 31న శంకుస్థాపన చేయనున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం భిక్కనూరు మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, రాజంపేటకు సంఘం నాయకులు కోరారు.

ముగిసిన రోడ్డు వివాదం

నాగిరెడ్డిపేట: మండలంలోని లింగంపల్లికలాన్‌లో రోడ్డుకు సంబంధించిన వివాదాన్ని అధికారులు పరిష్కరించారు. గోమాశికుంట నుంచి సాయిరెడ్డి పొలం వరకు చేపట్టిన రోడ్డుకు రైతు పోసాని యేసయ్య అభ్యంతరం తెలిపారు. అనుమతి లేకుండా తన పొలంలో నుంచి రోడ్డు వేస్తున్నారని ఇదివరకే కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ సయీద్ అహ్మద్ మస్రూర్, ఎస్సై ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి వనజ గురువారం పనులు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి విచారణ జరిపారు. పనులకు అభ్యంతరం తెలిపిన ఏసయ్య పొలంలో కొలతలు వేసి హద్దులు నిర్ణయించారు. దీంతో వివాదం సద్దుమణిగింది. దీంతో రోడ్డు పనులు కొనసాగించనున్నారు.